# అదృష్టం

-చిట్టిపెద్ది ఉమ

"థాంక్ గాడ్. ఈరోజు మీరు వస్తారో రారో అనుకున్నాను.." స్కూల్లోకి అడుగుపెడుతున్న సురేఖకి ఎదురువెళ్తూ అంది వైష్ణవి.

"సురేఖ గారూ.. రేపు సాయంత్రం మా విపుల్ పుట్టినరోజు సందర్భంగా ఓ చిన్న పార్టీ అరేంజ్ చేశాం. మీరు మీవారితో, పిల్లలతో తప్పకుండా రావాలి" వైష్ణవి సురేఖ చేతిలో వాళ్ల ఇంటి అడ్రస్ ఉన్న వాళ్ళాయన విజిటింగ్ కార్డు పెట్టింది.

సురేఖ కొడుకు అభిజిత్, వైష్ణవి కొడుకు విపుల్ ఇద్దరూ క్లాస్‌మేట్స్. రోజూ స్కూల్ వదిలే సమయానికి పిల్లల్ని పికప్ చేసుకోవడానికి వైష్ణవి, సురేఖ వస్తూ ఉంటారు.

అలా పిల్లల కోసం వెయిట్ చేసే టైంలో సురేఖ, వైష్ణవి ఒకళ్లతో ఒకళ్లు మాట్లాడుకుంటూ గడిపేస్తారు. గత ఆరునెలల్లో ఓ రకంగా సురేఖ, వైష్ణవి పిల్లలకన్నా ఎక్కువ ఫ్రెండ్సయ్యారనే చెప్పాలి.

వైష్ణవి క్రమం తప్పకుండా స్కూల్‌కి వస్తుంది కానీ అప్పుడప్పుడు సురేఖ బిజీ కారణంగా అభిజిత్‌ని తమ వీధిలో ఉండే పెద్దపిల్లలతో కలిసి రమ్మంటుంది. అరమరికలు లేకుండా వాళ్ళు ఫ్యామిలీల గురించీ, పిల్లల గురించీ మాట్లాడుకుంటూ మంచి ఫ్రెండ్స్ అయినా ఎప్పుడూ వైష్ణవీ, సురేఖా ఒకళ్ల ఇళ్ళకి ఒకళ్లు వెళ్లలేదు.

ఓ రకంగా సురేఖ ఇల్లు, వైష్ణవి ఇల్లు స్కూల్‌కి ఆపోజిట్ డైరెక్షన్స్‌లో ఉండడం కారణం. ఆరోజు సాయంత్రం భర్త రాగానే సురేఖ వైష్ణవి వాళ్లింటికి ఆహ్వానించిన సంగతి చెప్పింది.

కుమార్ విజిటింగ్‌కార్డు తీసుకుని ఇంటి అడ్రస్ అదీ చూశాడు. ఆఫీస్ నించి కనీసం ఓ గంట ముందు వస్తే కానీ వాళ్లింటికి వెళ్లడం కుదరదు.

"సరే వెళ్దాం. అభిజిత్ సంతోషపడతాడు. రేపు తొందరగా వస్తాలే. ఏదైనా మంచి గిఫ్ట్ కొనిపెట్టు రేపు సాయంత్రంలోగా" కుమార్ రానంటే ఎలా అని దిగులుపడిన సురేఖ కుమార్ ఓకే అనడంతో చాలా రిలీఫ్‌గా ఫీలయింది. వైష్టవి భర్త రిజర్వ్‌బ్యాంక్‌లో ఆఫీసర్. ఈమధ్యనే ఇల్లు కట్టుకున్నారు. ఇల్లు చూడడానికి రమ్మని ఎన్నోసార్లు వైష్ణవి ఆహ్వానించింది కూడా. అయినా సురేఖ పెద్దగా పట్టించుకోలేదు. సురేఖ తనింటికి రమ్మని గట్టిగా పిలిస్తే వైష్ణవి వచ్చి ఉండేదేమో కానీ సురేఖ ఒకటి రెండుసార్లు మాట వరసకి "రండి" అంది తప్పిస్తే తమ రెండుగదుల ఇంటికి వైష్ణవిని రమ్మనడానికి మొహమాటం అనిపించింది. అందుకే గట్టిగా ఒత్తిడి చేసి ఎప్పుడూ వైష్ణవిని, వాళ్ల ఫ్యామిలీని ఆహ్వానించలేదు.

* * *

"సురేఖగారూ రండి...రండి...వచ్చినందుకు చాలా సంతోషంగా ఉంది. వస్తారో రారో అనుకుంటున్నాను ఇప్పుడే. హాయ్ అభిజిత్. గుడ్ ఈవెనింగ్. విపుల్ అభిని నీ ఫ్రెండ్స్ దగ్గరికి తీసికెళ్ళు" వైష్ణవి గబగబా మాట్లాడుతూ సంతోషంగా ఆహ్వానించింది. వైష్ణవి ఇల్లు రెండతస్తుల మేడ. ఇంటి ముందున్న పచ్చటి లాన్‌లో చక్కగా అలంకరించబడి ఉన్న కుర్చీలు, టేబుళ్ళు. లాన్ చుట్టూ సన్నటి ఆకుల క్రోటన్ కుండీలు. చిలకాకుపచ్చ చీరకి ఎర్రంచులా లాన్ చుట్టూ సన్నటి ఆకుల క్రోటన్. అయిదువందల గజాలు ఉంటుందేమో ఇంటి స్థలం సుమారుగా. వైష్ణవి డూప్లెక్స్ ఇల్లు డ్రీం హౌస్ అన్న పదానికి నిర్వచనంలా ఉంది. సురేఖ కళ్లు వెడల్పు చేసుకుని పరిసరాలని తన్మయత్వంతో చూస్తోంది.

"సురేఖా ఈయనే మావారు. ఏమండీ వీళ్ళే మన విపుల్ బెస్ట్ ఫ్రెండ్ అభి పేరేంట్స్" వైష్ణవి వాళ్లాయనని తీసుకొచ్చి పరిచయం చేసింది.

"వెల్‌కమ్...ఐయాం డి.ఎస్.ధర్.." కుమార్‌తో కరచాలనం చేస్తూ అన్నాడు వైష్ణవి భర్త.

"ప్లీజ్... ఫీల్ ఫ్రీ ఎండ్ ఎంజాయ్ యువర్‌సెల్ఫ్. కేక్ కట్టింగ్ ఇంకో అయిదునిముషాల్లో అవుతుంది మిగిలినవాళ్లనీ పలకరించాలి ప్లీజ్" వైష్ణవి, ధర్ సురేఖనీ, కుమార్‌నీ ఓ టేబుల్ దగ్గర కుర్చోబెట్టి మిగిలినవాళ్ళని పలకరించడానికి వెళ్లిపోయారు ధర్ పొడుగ్గా ఎత్తుకు తగ్గ లావుతో చాల హుందాగా, హేండ్సమ్‌గా ఉన్నాడు.

'అనాకారి కాకపోయినా అందగత్తెల జాబితాకి ఆమడదూరంలో ఉన్న అతిసామాన్యమైన వైష్ణవికి ఎంత చక్కటి భర్త. అదృష్టవంతురాలు' సురేఖ అనుకోకుండా ఉండలేకపోయింది.

ధర్ చూపులు గుర్తుకొచ్చి సురేఖ పెదవులు విచ్చుకున్నాయి. తన వైపు అదోరకంగా చూశాడు ఆ కళ్లల్లో ఉన్నది ఏమిటో ఆశ్చర్యమా? అబ్బురమా? విస్మయమా? అపనమ్మకమా? అబ్బురమే అయి ఉంటుంది. తన అందం అలాంటిది. ఒక్కసారి చూసిన వాళ్ళెవ్వరైనా కళ్లు మరల్చుకోవడానికి చాలా కష్టపడతారు. ఓ క్షణం ఎంతో గర్వం అనిపించింది సురేఖకి. కేక్ కట్టింగ్ కోసం కేక్ పెట్టిన టేబుల్ వైపు నడుస్తున్నారు. విపుల్‌కి ఓ వైపు వైష్ణవి, ఇంకో వైపు ధర్. చూడముచ్చటగా ఉన్నారు. అతి సామాన్యంగా ఉండే వైష్ణవికి ఎంత చక్కటిభర్త. అదృష్టవంతురాలు సురేఖ అనుకోకుండా ఉండలేకపోయింది.

సన్నగా, పొడుగ్గా కాలేజీ అమ్మాయిలా ఉన్న వయసుకి పది సంవత్సరాలు తక్కువగా కనిపించే తన పక్కన పొట్టిగా లావుగా ఉన్న కుమార్.

కేక్ కట్టింగ్ అయింది. అందరూ బెస్ట్ విషెస్, గిఫ్టు అందిస్తున్నారు. సురేఖ, కుమార్ అభి చేత విపుల్‌కి ప్రజంటేషన్ ఇప్పించి భోజనాలవైపు నడిచారు. పేరున్న హోటల్ నుంచి స్టాఫ్‌ని పిలిపించి ఏర్పాటుచేసిన డిన్నర్ అరేంజ్‌మెంట్ చాలా అందంగా ఉంది. అభికి, గౌరికి ప్లేట్లలో పూరీ, కూర వేసి ఇచ్చి తనూ కొద్దిగా తీసుకుంది. కుమార్ రుచికరంగా ఉన్న వంటకాలని మెచ్చుకుంటూ రెండోసారి, మూడోసారి వడ్డించుకుని తింటున్నాడు. వారించినా లెక్కచెయ్యడు అన్నది తెలిసి నిట్టూర్చింది సురేఖ. ఒబెసిటీ లెవెల్ ఏనాడో దాటినా కుమార్ ఏమాత్రం తిండిని కంట్రోల్ చేయడు. సురేఖ ఎన్నోసార్లు కుమార్‌ని మార్చాలని ప్రయత్నించి విఫలమై ఆఖరికి వదిలేసింది.

"ఏయ్ రేఖా.. లావుగా ఉన్నాడని దువ్వూరి వాళ్ళ సంబంధం వదిలేసుకున్నావు. ఇప్పుడు మీ ఆయన్ని ఏంచేస్తావే" అత్తయ్య కూతురు హేమాంగి ఆమధ్య వెక్కిరించడం గుర్తుకొచ్చినప్పుడల్లా మనస్సు ముడుచుకుపోతుంది.

హేమ పైకి అంది. లోపల ఇంకెంతమంది ముసిముసిగా నవ్వుకుంటున్నారో. పెళ్లికి ముందు కాబట్టి లావుగా ఉన్న పెళ్లికొడుకుని వద్దని ఏడ్చి గోలచేసి పంతం నెగ్గించుకుంది. ఇప్పుడేం చేయగలదు. మగవాళ్ళు ఈ రోజుల్లో రూపానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. అలాగైనా కుమార్ కాస్త ఒళ్ళు తగ్గిస్తే

బావుండును అనుకునే సురేఖకి అక్కడా నిరాశే.

'వయసులో ఉండగానేగా తినగలిగేది. మగవాడికి రూపమేమిటి?' అన్న భావాలు కుమార్‌వి.

"మా ఇంట్లో అందరూ లావుగానే ఉన్నారు. ఎవరూ ఎనభైకి తక్కువ బతకలేదు" అంటాడు.

ఇంట్లో వంటల్లోనైనా తనే కాస్త నూనెలు, పంచదార వాడకం తగ్గించాలనుకున్నా సురేఖకి అత్తగారు ఓసారి వచ్చినప్పుడు గట్టిగా ఓ డోస్ ఇచ్చింది.

"మాది తిని చెడ్డకుటుంబం. నూనె, నెయ్యి లేని చప్పిడి కూడు పెట్టకు వాడికి. వారంవారం డబ్బాల్లో స్వీట్లు, జంతికలు, కారప్పూస చేసి పోయ్యి. మధ్యమధ్య చిరుతిళ్ళు తినడం మాకలవాటు. పిల్లల్ని తిండికి మొహం వాచిన వాళ్ళల్లా పెంచకు" సురేఖకి వారం, వారం స్వీట్లు, జంతికలు చెయ్యడం తప్పదు. సురేఖ చెయ్యకపోతే కుమార్ బజార్ నించి కొని తెస్తాడు.

"ఇంక వెళ్దాం" కుమార్ మాటలకి ఈలోకంలోకి వచ్చింది సురేఖ. వైష్ణవికి, ధర్‌కి వెళ్ళి వస్తామని చెప్పి సెలవు తీసుకున్నారు.

"అప్పుడప్పుడు వస్తూండండి" ధర్, వైష్ణవి గేటు దాకా వచ్చి సాగనంపుతూ అన్నారు.

సురేఖకి మళ్ళీ ధర్ తన వైపు అదోలా చూస్తున్నాడని అనిపించింది. 'ఆ కళ్ళల్లో భావమేమిటి?' ఎంత ఆలోచించినా అంతుపట్టలేదు సురేఖకి. సురేఖ, వైష్ణవి ఎప్పటిలాగే రోజూ స్కూల్లో కలుసుకుని కాస్సేపు కబుర్లు చెప్పుకుంటూనే ఉన్నారు.

"సురేఖగారూ మీకో గమ్మత్తయినే విషయం చెప్పనా? మావారు పెళ్లికి ముందు మీవారికన్నా లావుగా ఉండేవారు తెలుసా?"

"ఇంపాజిబుల్"

వైష్ణవి ముసిముసిగా నవ్వింది.

"అందరూ అలాగే ఉంటారు. కానీ పచ్చి నిజం"

"ఆయన నన్ను చూడ్డానికి వచ్చినప్పుడు నేను షాకయ్యానంటే నమ్ముతారా? నా అభిప్రాయానికి విలువ ఉండి ఉంటే ఎవ్వరైనా అడిగి ఉంటే చచ్చినా ఒప్పుకునే దాన్ని కాదు. ఐదుగురు ఆడపిల్లల్లో ఆఖరిదాన్ని. ఏదో గుళ్ళో పదిమంది పసుపుతాడుతో అయిందనిపించారు మా పెళ్ళి. అంతటిలేమిలో ఉన్న వాళ్ళకి ఎన్ను



కునే అవకాశం ఎక్కడిది? మొదటిరాత్రి ఆయన నాతో మాట్లాడిన మాట ఏంటో తెలుసా?''


"నేను నీకు నచ్చలేదని తెలుసు. ఈ ఒళ్ళు కారణంగానే కదూ. తగ్గించుకుంటాను ప్రామిస్..'" అయిన ఆరు నెలల్లో మాట నిలబెట్టుకున్నారు. అప్పటినుంచీ ఎంతో జాగ్రత్తగా బాడీని మెయిన్‌టెయిన్ చేస్తున్నారు.

"మీరు మీ వారిని మార్చుకోగలిగారన్నమాట''


"ఉహూ...ఆయన నిర్ణయానికి కారణం నేను కాదు సుమండీ. మొదటి పెళ్ళిచూపుల్లో ఈయనకి ఎంతగానో నచ్చిన అమ్మాయి రిజెక్ట్ చేయడంట. ఆ అమ్మాయెవరో తెలిస్తే థ్యాంక్స్ చెప్పాలి. ఇంతటి మంచి మనిషిని నాకు వదిలినందుకు'' వైష్ణవి నవ్వుతుంటే సురేఖ జత కలిపింది.

'తను మొదటి పెళ్ళికొడుకుని కాదన్నట్టు అన్నమాట. లావుగా ఉండే ధర్ సన్నబడడం, సన్నగా ఉండే కుమార్ లావుబడడం...విధి అంటే ఇదేనేమో! ఒకవేళ 'ధర్'ని మొదట పెళ్లిచూపుల్లో చూసిన అమ్మాయి ఒప్పుకుని ఉంటే ఈయన సన్నబడి ఉండేవాడా?' సురేఖ తనలో చెలరేగుతున్న పిచ్చి ఆలోచనలతో నవ్వుకుంది.

ఇష్టం



కొన్ని కొన్ని రంగులంటే కొంతమందికి ఎంతో ఇష్టం. బ్లాక్ అంటే తనకెంతో ఇష్టం అంటున్నాడు జాకీష్రాఫ్. 36చైనా టౌన్ షూటింగ్‌లో బ్లాక్ డ్రెస్‌లో వెరైటీగా కన్పించాడట జాకీ. ఈ చిత్రం ముహూర్తం పాట్ కోసం బ్లాక్ డ్రెస్ వేసుకొచ్చిన జాకీ ఎంతో ఉల్లాసంగా దర్శనం ఇచ్చాడట. సుభాష్ ఘాయ్‌తో ముచ్చట్లాడుతూ కన్పించిన జాకీకి చిన్నతనం నుంచి బ్లాక్ డ్రెస్‌లేసుకుని తిరగడం ఎంతో ఇష్టంట. అందుకే ఏవైనా స్పెషల్ అకేషన్స్ టైంలో ఇలా తన ఇష్టాన్ని నెరవేర్చుకున్నాట్ట.




* * *

"రేఖా...ఈ కార్డు ఎవరిదే'' ఓ మధ్యాహ్నం చెల్లెలింటికి వచ్చిన సుజాత టేబుల్ మీద ఉన్న 'ధర్' విజిటింగ్‌కార్డు చూపిస్తూ అడిగింది.

"అదా.. అభి్‌ఫ్రెండ్ విపుల్ అని వాళ్ల నాన్నది. పదిరోజుల కిందట విపుల్ బర్త్‌డే అని పిలిస్తే వెళ్లాం. వాళ్ల ఇల్లు ఎంత బావుందో. ఆయన రిజర్వ్‌బ్యాంక్‌లో ఆఫీసర్. వైష్ణవి నాకు మంచి ఫ్రెండయింది. ఎంత అదృష్టవంతురాలో..'' సురేఖ వైష్ణవి గురించి తనకి తెల్సినది చెప్తూ అంది.

"ఈయనెవరో తెలుసా?'' సుజాత కాఫీ తెస్తున్న సురేఖని అడిగింది.

"అదే చెప్పానుగా. విపుల్ వాళ్ల నాన్న అని..'' సుజాతకో కప్పు ఇచ్చి తనూ తీసుకుంది సురేఖ.

"ఇతనే శశిధర్'' సుజాత కాఫీ సిప్ చేస్తూ అంది మెల్లిగా.

"శశిధర్ ఎవరూ... మనకి తెలిసినవాళ్ళా?''

సుజాత పేలవంగా నవ్వింది.

"నువ్వు వద్దని ఏడ్చి గోల చేసిన దువ్వూరి వాళ్ళబ్బాయి''

సుజాత తన చేతి వణుకు కప్పిపుచ్చుకోవడానికి కాఫీ కప్పుని రెండు చేతుల్తో పట్టుకుంది.

"ఛ...ఆయనకాదు. అతనే అని నీకెలా తెలుసు'' సురేఖ పైకి అందే కానీ ధర్ తనవైపు చూసిన చూపుల్లో భావం ఇప్పుడర్థమవుతోంది.

"నిన్ను చూడ్డానికి వచ్చినప్పుడు ఏదో ప్రయివేట్ బ్యాంక్‌లో పనిచేస్తూండేవాడు. తర్వాత పరీక్షలు పాసై రిజర్వ్‌బ్యాంక్‌లో చేరాడు. మొన్నామధ్య మీ బావగారు ఆడిట్‌కి వెళ్లినప్పుడు తెలిసింది'' సురేఖికి తనూ వైష్ణవీ మాట్లాడుకున్న సంఘటనలూ, బర్త్ డే పార్టీలో ధర్ చూపులు...గతం అన్నీ గుర్తుకు రాసాగాయి. ధర్ అంటే శశిధర్..పెళ్లిచూపుల్లో అతని మొహం తను ఎక్కడ సరిగ్గా చూసింది. పర్వతకాయాన్ని చూస్తూనే మొహం మాడ్చుకుని తలెత్తలేదు. మంచి సంబంధం చిన్న కారణంగా వద్దంటోందని ఇంట్లో అందరికీ కోపాలు వచ్చాయి. ముఖ్యంగా బావగారికి...ఎందుకంటే ఆయనే ఈ సంబంధం గురించి చెప్పి పెళ్ళిచూపులు ఏర్పాటుచేసింది. ఆయన వచ్చే వేళవుతోంది. పకోడీలు చేస్తాను. రావే వంటింట్లో కూర్చుని కబుర్లు చెప్పుకుందాం...'' సురేఖ తనలో చెలరేగుతున్న భావాలని కప్పిపుచ్చుకోవడానికి వంటింటి వైపు నడుస్తూ అంది సుజాతతో.

ఆ తర్వాత అంటే శశిధర్ వాళ్ళు వచ్చి వెళ్లాక ఎన్నాళ్ళో ఇంట్లో అందరికీ తనంటే కోపం. అమ్మకీ, నాన్నకీ..కుమార్ వాళ్ళూ పెళ్లిచూపులకి వచ్చేముందు తండ్రి అన్నది ఒకేమాట. "అబ్బాయి సన్నగా ఉన్నాడు'' అంటే ఈసారి నోరెత్తితే ఊరుకునేది లేదు అన్న వార్నింగ్ అందులో ధ్వనించింది. తను కాదంది కాబట్టే వైష్ణవిలాంటి పేద అమ్మాయికి, అతి మామూలుగా ఉండే అమ్మాయికి అదృష్టం పట్టింది. ఎప్పుడు, ఎవరికి, ఎవరికారణం వల్ల ఏ అదృష్టం పడుతుందో ఎవరికి తెలుసు? తరుగుతున్న ఉల్లిపాయలు వంకన తన కన్నీళ్లని కప్పి పుచ్చుకుంటున్న సురేఖ వైపు జాలిగా చూసింది సుజాత. వైష్ణవి అదృష్టాన్ని పొగడుతుంటే గబుక్కున నోరుజారింది. శశిధర్ ఎవరో చెప్పకుండా ఉండి ఉంటే బావుండేది. సురేఖ మనస్సులో అనవసరంగా తుఫాను సృష్టించినందుకు బాధపడింది సుజాత. శశిధర్ తనకి దక్కలేదని కాదు ఈ బాధ అంతా. ఏది వద్దనుకుని తను నలుగురిలో చెడ్డదయిందో అదే తనకి లభించినందుకు 'విధి విలాసం' అనేది దీని పేరేనేమో. వ్రతమూ చెడింది ఫలమూ దక్కలేదు అన్నట్టు సురేఖ పెదవుల మీద చిరునవ్వు.

"అక్కా... ఈ నాలుగు ఉల్లిపాయలు నువ్వు తరిగెయ్యి. నేను పిండి కలిపి పకోడీలు వేస్తాను'' నవ్వుతూ అంటున్న సురేఖని చూసి సుజాత మనస్సు తేలికపడింది.

★